teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 37 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 11 జూలై 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆర్టీసీ తీపికబురు

**కొత్తగా అందుబాటులోకి రానున్న 422 బస్సులు**

**ఈ మేరకు తెలంగాణ ఆర్టీసీ వెల్లడి**



తెలంగాణ బ్యూరో, జులై 10 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆర్టీసీ తీపికబురు చెప్పింది. ఈ మేరకు కొత్తగా 422 బస్సులను అందుబాటులోకి సుకురాబోతున్నట్లుగా వెల్లడించింది. ఇప్పటికే కాలంచెల్లిన 294 పల్లె వెలుగులు, 88 మెట్రో డీలక్స్‌లను, 17 ఎక్స్ప్రెస్ లు, 22 డీలక్స్‌ల

మిగతా 2 లో



## కొండా మురళి వాఖ్యలతో కాంగ్రెస్ పార్టీలో అలజడి



**గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ భేటీ**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో, గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ కీలక సమావేశాన్ని నిర్వహించింది. పార్టీలో నెలకొన్న వివాదాలపై ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటారు? అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో వీటిని వదిలేస్తారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. కాగా రాజకీయ నిపుణులు అంచనా వేసినట్లుగానే తుది తీర్పు వాయిదా పడింది.

- కొండా మురళి వ్యవహారంపై సుదీర్ఘ చర్చ
- కొండా కుటుంబంపై పలువురు ఎమ్మెల్యేల ఆరోపణలు
- నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారని అభ్యంతరం
- చర్యలకు ఎమ్మెల్యేల డిమాండ్
- ఆరు పేజీల నివేదికను కమిటీకి సమర్పించిన కొండా మురళి
- వాయిదా పడిన కీలక నిర్ణయం
- మరో సమావేశంలో తుది తీర్పు
- పార్టీని కుదిపేస్తున్న ఇతర అంతర్గత వివాదాలు



02

## బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు

**స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం కీలక నిర్ణయం**

**కులగణన పూర్తి, త్వరలో ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ**

**ఈ మేరకు తెలంగాణ కేబినెట్ తీర్మానం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన**

**బీసీ వర్గాల్లో హర్షం, కాంగ్రెస్‌కు లాభమా?**



హైదరాబాద్, జూలై 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర

మిగతా 2 లో

## అన్నపూర్ణ క్యాంటీన్లకు ఇక ఇందిరమ్మ కళ

రూ.5కే టిఫిన్, భోజనం
139 కొత్త కేంద్రాలతో
కార్మికులు, విద్యార్థులకు మరింత చేరువ
పేదల ఆకలి తీర్చేందుకు సర్కార్ నూతన అడుగులు



02



02

## మందుబాబులకు షాకిచ్చిన పోలీస్ శాఖ

**రెండ్రోజులు మద్యం షాపుల మూసివేతకు ఆదేశాలు**

**ఈ మేరకు సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ**

## చేనేత కార్మికుల రుణాల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

**ఖాతాలలో రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయాలి**

**అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేసి లబ్ధిదారుల ఖాతాలలో రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పనీతీరుపై గురువారం



మిగతా 2 లో



02

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ఎంపీలకు అవకాశం కల్పించాలి

**ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వాలి**

**పార్టీలకు అతీతంగా 17 మందికి అవకాశం కల్పించాలి**

**సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన ఎంపీ రఘునందన్ రావు**

## కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై స్పందించిన కేటీఆర్



మృతుల కుటుంబాలను ప్రభుత్వం అండగా నిలవాలి

ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలి

చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి

.. వివరాలు 2లో

## భద్రాచలం పరిధి 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి


**ఎమ్మెల్సీ కవిత డిమాండ్**

**సీతారామ ఆలయ భూముల పరిరక్షణపై ఏపీ సీఎంకు లేఖ**

హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు



మిగతా 2 లో



## యువత భవిష్యత్‌ను ఛిద్రం చేస్తున్న వీళ్లా.. సెలబ్రిటీలు..

**బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ తో మరణాలకు కారణం అయ్యారు**

**ఎక్స్ వేదికగా స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్**

**బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులపై దృష్టి సారించిన ఈడీ**

02

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**సుప్రీంకోర్టులో సిట్ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం**

**ఈ మేరకు ఢిల్లీకి వెళ్లిన డీసీపీ, ఏసీపీ వెంకటగిరి**



తెలంగాణ బ్యూరో, జులై 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సిట్

మిగతా 2 లో

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడికి జ్యుడిషియల్ రిమాండ్



అధ్యక్ష ఎన్నికల కేసులో నిందితుడిగా జగన్ మోహన్‌రావు

నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపణలు

# కొండా మురళి "వాఖ్యల"తో కాంగ్రెస్ పార్టీలో అలజడి



హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో, గాంధీభవన్‌లో గురువారం జరిగిన క్రమశిక్షణ కమిటీ సమావేశం తీవ్ర ఉత్కంఠ రేపింది. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబానికి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మధ్య జరుగుతున్న వివాదంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. అయితే, ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోకుండా మరో సమావేశానికి వాయిదా వేయడం గమనార్హం. వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. కొండా కుటుంబం తమ నియోజకవర్గాల విషయాల్లో జోక్యం చేసుకుంటోందని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తోందని వారు క్రమశిక్షణ కమిటీ ముందు తమ వాదన వినిపించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తదితరులు గాంధీభవన్‌లో కమిటీ ఎదుట హాజరయ్యారు. గంటకు పైగా జరిగిన చర్చల్లో వివాదం యొక్క పలు కోణాలను పరిశీలించారు. మరోవైపు, కొండా సురేఖ భర్త కొండా మురళి కూడా ఈ విషయంపై తన వెర్షన్‌ను వివరిస్తూ ఆరు పేజీల నివేదికను కమిటీకి సమర్పించారు. కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవితో మాట్లాడుతూ, పార్టీకి తాము ముఖ్యమా లేక కొండా కుటుంబం ముఖ్యమా తేల్చుకోవాలని స్పష్టం చేశారు.

**పార్టీ అధిష్టానం జోక్యం - తదుపరి కార్యాచరణ**

క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మాట్లాడుతూ, "ఎమ్మెల్యేలు మరియు నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భవిష్యత్ కార్యాచరణను సకాలంలో తెలియజేస్తాము" అని తెలిపారు. ఈ విషయాన్ని ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో పాటు ఇతర సీనియర్ పార్టీ నాయకులతో కూడా చర్చిస్తామని ఆయన చెప్పారు. "తుది నిర్ణయం తీసుకునే ముందు మరొక సమావేశం జరుగుతుంది" అని మల్లు రవి స్పష్టం చేశారు.

**క్రమశిక్షణకు కట్టుబడి ఉన్నారా?**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, ఈ అంశంలో చాలా సీరియస్‌గా ఉండాలని ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో నేతలకు స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ వివాదాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. గతంలో, జూన్ 29, 2025న జరిగిన సమావేశంలో, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డి. సీతక్కపై ఆరోపణలు చేసినందుకు గాను పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్‌ను ఆరు సంవత్సరాలు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

కొండా మురళి వ్యవహారంపై కాంగ్రెస్ నాయకత్వం ఏం చేయబోతోంది, అంతకంటే ముందు క్రమశిక్షణ కమిటీ ఈ వివాదంపై ఎలాంటి నివేదిక ఇవ్వనుందనే అంశంపై జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో, పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశం తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్తును ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి. నేతల మధ్య సయోధ్య కుదిరి పార్టీ బలోపేతం అవుతుందా, లేక ఈ వివాదాలు మరింత ముదిరి పార్టీకి నష్టం కలిగిస్తాయా అనేది రానున్న రోజుల్లో తేలిపోతుంది.

## అన్నపూర్ణ క్యాంటీన్లకు ఇక 'ఇందిరమ్మ' కళ




హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వం రూ.5కే భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. చాలా మంది కార్మికులు, పేదలు, కాలేజీ స్టూడెంట్స్ ఈ క్యాంటీన్లలో భోజనం చేస్తుంటారు. అయితే ఇవే క్యాంటీన్‌లను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చడంతో పాటు భోజనం మాత్రమే కాకుండా టిఫిన్స్ కూడా అందుబాటులోకి తీసుకురావాని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇడ్లీ, ఉప్మా, పులిహోరలను టిఫిన్స్‌గా మెనూలో చేర్చాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే క్యాంటీన్ల సంఖ్య తక్కువగా ఉండటం, కంటైనర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో కొత్త క్యాంటీన్లను నగరంలో ఏర్పాటు చేస్తున్నారు. 139 ప్రాంతాల్లో రూ.11.43 కోట్లతో కంటైనర్లను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఈ క్యాంటీన్లలో భోజనంతో పాటు టిఫిన్స్ కూడా రూ.5కే ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

## చేనేత కార్మికుల రుణాల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

హైదరాబాద్ లో చేనేత జౌళిశాఖ అధికారులతో తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పోరేషన్ల నుండి సంవత్సరానికి సంబంధించి వారికి అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోగానే ఆర్డర్లు తెప్పించుకోవాలి. ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన ప్రభుత్వ శాఖలకు దుస్తుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరిచి ఫలితాలు రాబట్టాలని స్వయం సహాయక సంఘాల మహిళలకు అందచేసే మహిళశక్తి చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ సంస్థలో మానవ వనరులను సక్రమంగా వినియోగించుకొని సంస్థను అభివృద్ధిభాటలో నడిచేటట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. వేములవాడ నూలు డిపో ద్వారా నేత కార్మికులకు అవసరం మేరకు నూలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్ టీ)ని హైద్రాబాద్ నుండి యాదాద్రి జిల్లా పోచంపల్లిలో శాశ్వత ప్రాతిపదికన సంవత్సరంలోగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**రుణమాఫీ కోసం 33 కోట్లు:**

చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీ కోసం 33 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 5691 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందనున్నారని, త్వరలోనే వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేసి, నిధులు విడుదల చేయబోతున్నట్లు వివరించారు. జౌళిశాఖలో అమలవుతున్న వివిధ పథకాలను గురించి ఈ సమీక్షలో మంత్రికి ఆమ వివరించారు. తెలంగాణ నేతన్న పొదుపు పథకంలో భాగంగా ఇప్పటి వరకు 33,913 మంది చేనేత కార్మికులు నమోదు చేసుకున్నారని, ఈ పథకంలో భాగంగా చేనేత కార్మికులు తమ వేతనంలో 8 శాతం మొత్తాన్ని బ్యాంకులలో జమచేస్తే ప్రభుత్వం 16 శాతం మొత్తాన్ని ఆర్డీ-11 ఖాతాలలో జమచేస్తుందని తెలిపారు. నేతన్న భద్రతలో భాగంగా వయస్సుతో సంబంధం లేకుండా ప్రమాదవశాత్తు గాని, సహజ మరణం పొందిన కార్మికుల నామినీలకు రూ.5 లక్షలు బీమా అందించినట్లు తెలిపారు. గతేడాది ఆగస్టు 14 నుంచి ఇప్పటివరకు మరణించిన 194 మంది చేనేత కార్మికుల నామినీలకు రూ.9.70 కోట్ల ప్రభుత్వ సాహాయం అందించి వారి కుటుంబాలను ఆదుకున్నట్లు వివరిచారు. తెలంగాణ నేతన్నకు భరోసా పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 48.8 కోట్లు కేటాయించామని నేత కార్మికుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

**చేనేత పురస్కార గ్రహీతలకు మంత్రి సన్మానం:**

భారత ప్రభుత్వం చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారం -2024 కు ఎంపికైన వారిని మంత్రి తుమ్మల సన్మానించారు. యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్ ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ చేనేత అవార్డుకు ఎంపికయి చేనేత రంగంలో ఆదర్శంగా నిలిచి తెలంగాణ రాష్ట్రానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తేవడం గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా 19 మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా అందులో మన తెలంగాణ నుంచి ఇద్దరికి పురస్కారాలు రావడం అభినందనీయం అన్నారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనిస్తుందని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరగడం కోసం ప్రత్యేక లేబుల్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆర్టీసీ తీపికబురు

మొదటి పేజీ తరువాయి

స్థానంలో కొత్త బస్సులను రోడ్లపై సందడి చేయనున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో బస్సులలో ఆక్యుపెన్సీ పెరగడంతో ప్రయాణి కులకు మెరుగైన సేవలను అందించేందదుకు ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. 13 నుంచి 15 లక్షల కి.మీ తిరిగినా లేదా 15 ఏళ్ల కాలం దాటిన బస్సులను ఆర్టీసీ ఇక నుంచి పక్కన పెట్టనుంది.




## బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం బీసీలకు రాజకీయం ద్వారా న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో కుల గణన పూర్తయ్యిందని, దేశానికి ఆదర్శంగా తెలంగాణ ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు హామీ ఇచ్చింది. ఆ హామీని అమలు పరచేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదించడంతో పాటు, త్వరలోనే ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిర్ణయంతో బీసీ వర్గాల్లో భారీ స్థాయిలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు ఈ నిర్ణయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక గత కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై తాజా కేబినెట్ సమావేశంలో సమీక్ష జరిపినట్లు సమాచారం. 2023లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు 18 కేబినెట్ సమావేశాలు జరిగినట్టు తెలిపారు. ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అమలు, ఇతర పాలనాసంబంధిత కీలక అంశాలపై చర్చ జరిగిందని తెలుస్తోంది. ఇక కాసేపట్లో మీడియా సమావేశంలో అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.





## భద్రాచలం పరిధి 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి

మొదటి పేజీ తరువాయి



గురువారం ఏపీ సీఎం చంద్రబాబు నాయకుడికి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను చీకటి ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో విలీనం చేయించుకున్నారని ఆరోపించారు. దీంతో లోయర్ సీలేరు పవర్ ప్లాంట్‌ను లాగేసుకొని తెలంగాణలో కరెంట్ కష్టాలకు కారకులయ్యారని ఆరోపించారు. పోలవరం పేరుతో భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని ముంచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న పట్టణాన్ని ఆనుకొని ఉన్న యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రాచలం రాముల వారి గుడి మన్యం భూములు పురుషోత్తపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. రాములవారు తెలంగాణలో ఉంటే ఆయన మన్యం భూములు ఏపీలో ఉండటంతో ఆ భూముల్లో ఇష్టారాజ్యంగా కబ్జాలు కొనసాగుతున్నాయని వివరించారు. కబ్జాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన భద్రాచలం రామాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవి పై కబ్జాదారులు దాడి చేసిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని వెల్లడించారు. రాముడి పేరు చెప్పి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో మీరు భాగస్వామిగా ఉన్నారు. అదే రాములవారు కొలువై ఉన్న భద్రాచలం పట్టణాన్ని పోలవరంలో ముంచేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఐదు గ్రామాల ప్రజలు విద్య, వైద్యం సహా ఇతర సేవలు పొందడానికి, ఉపాధిని అందిపుచ్చుకోవడానికి వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు భద్రాచలం రాముల వారి భూముల పరిరక్షణ కోసం వెంటనే యటపాట, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడికి జ్యుడిషియల్ రిమాండ్



మేడ్చల్, జులై 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావుకు మల్కాజ్‌గిరి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల అక్రమాల కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహనరావు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపణలు చేస్తోంది. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకాన్ని క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి వాటిని జగన్మోహన్ కు అప్పగించారు. వాటిని ఉపయోగించి జగన్మోహన్ రావు హెచ్‌సీఏ అధ్యక్షుడు అయినట్లుగా సీఐడీ వాదిస్తోంది. కాగా హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ వివాదంలో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐడీ ప్రకటించింది. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు, హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, శ్రీచక్ర క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేంద్ర యాదవ్, హెచ్‌సీఏ సీఈఓ సునీల్ కాంటే, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు జి.కవితలను సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. నిధులు దుర్వినియోగం అయ్యాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ వారందరినీ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలోనే జగన్మోహనరావు నకిలీ పత్రాలతో హెచ్‌సీఏ రేసులో పోటీ చేసినట్లుగా గుర్తించింది.

## మందుబాబులకు షాకిచ్చిన పోలీస్ శాఖ



హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగర పోలీస్ శాఖ మందుబాబులకు షాకిచ్చింది. ఈనెల 13వ తేదీ ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా రెండ్రోజులపాటు మద్యం షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకూ మద్యం షాపులు మూసివేయాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సీపీ ఆదేశాలతో హైదరాబాద్ సెంట్రల్, ఈస్ట్, నార్త్ జోన్ల పరిధిలోని గాంధీనగర్, చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ, బేగంపేట, గోపాలపురం, తుకారాంగేట్, మారేడ్ పల్లి, మహంకాళి, రామ్ గోపాల్ పేట్, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు రెండ్రోజులు మూతపడనున్నాయి. ఈ ఆదివారం బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లో పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. నాలుగు రోజుల ముందు నుంచే పోలీసులు గస్తీ పెంచారు. అనుమానాస్పదంగా తిరిగే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇక ఉజ్జయిని మహంకాళి బోనాల్లో కీలక ఘట్టం భవిష్యవాణి. మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిలబడి చెప్పే భవిష్యవాణి నిజమవుతుందని భక్తుల నమ్మకం. ఈ రంగం చూసేందుకే భక్తులు ఆలయానికి తరలివస్తారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ఎంపీలకు అవకాశం కల్పించాలి



హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యేల మాదిరిగా ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపీలు కూడా ప్రజా ప్రతినిధులేనని, ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు అవకాశం కల్పించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వాలని కోరారు. పార్టీలకు అతీతంగా మొత్తం 17 మంది ఎంపీలకు ఈ అవకాశం కల్పించాలని, లబ్దిదారుల ఎంపికలో సహేతుకత పెరగడానికి దోహదం చేస్తుందని తన అభిప్రాయాన్ని లేఖలో వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా అనుసంధానించడం శుభపరిణామమని, పేద ప్రజలకు మరింత న్యాయం జరగడం కోసం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో తమకు కూడా ఎంపీగా పనిచేశారని రఘునందన్ రావు లేఖలో గుర్తు చేశారు. తన అభ్యర్థన మేరకు వెంటన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

## యువత భవిష్యత్‌ను చిద్రం చేస్తున్న వీళ్లా.. సెలబ్రిటీలు..





హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన బెట్టింగ్ మాఫియా దానిని ప్రమోట్ చేస్తున్న సినీ ప్రముఖులపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి నోటీసులు కూడా ఇచ్చారు. తాజాగా ఈ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులపై ఈడీ దృష్టి సారించి హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల ఆధారంగా 29 మంది సినీ ప్రముఖులతో పాటు ఇతరులపై పీఎంఎల్ఏ యాక్ట్ కింద కేసులు నమోదు చేసింది. త్వరలోనే వారి స్టేట్ మెంట్ తీసుకునేందుకు ఈడీ అధికారులు సిద్ధం అయ్యారు. అయితే ఈ తాజా వ్యవహారంపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ ను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సజ్జనార్ గతంలో యువతను అప్రమత్తం చేసే విధంగా అనేక పోస్టులు పెట్టారు. తాజాగా సినీ ప్రముఖులపై కేసులు నమోదు అవ్వడంపై స్పందిస్తూ తమ స్వలాభం కోసం బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యువత బంగారు భవిష్యత్‌ను చిద్రం చేస్తున్న వీళ్లా సెలబ్రిటీలు!? సమాజ శ్రేయస్సుకు నాలుగు మంచి పనులు చేసి యువతకు ఆదర్శంగా ఉండాల్సిన మీరు బెట్టింగ్ యాప్ లకు బానిసలను చేసి ఎంతో మంది యువకుల మరణాలకు కారణం అయ్యారు. మీరు బెట్టింగ్‌కు ప్రోత్సహించడం వల్లే యువత బంధాలు, బంధుత్వాలను మరిచి కన్న తల్లిదండ్రులను చంపేస్తున్నారు. దొంగతనాలు చేస్తూ నేరాల బాట పడుతున్నారు. కాసులకు కక్కుర్తి పడి సామాజిక బాధ్యత ఏ మాత్రం లేకుండా సమాజం ఎటు పోయిన పర్వాలేదు మీ ధోరణి సరైంది కాదు. అని రాసుకొచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లారు. అయితే, గతంలో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మినహాయింపులు రద్దు చేయాలని సుప్రీంకోర్టును సిట్ అధికారులు కోరనున్నారు. ప్రభాకర్ రావు విచారణకు సహకరించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభాకర్ రావును కస్టడీకి తీసుకోవాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా. ఇప్పటికే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు డేటా కీలకంగా మారనుంది. వీటి నుంచి డేటాను సేకరించి పనిలో అధికారులు ఉన్నారు. ప్రభాకర్ రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కి సిట్ అధికారులు పంపించారు. ఈ క్రమంలో 2023 అక్టోబర్ నుండి మార్చి15 వరకు కాల్ డేటాను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ప్రభాకర్ రావు పలువురు బీఆర్ఎస్ నేతలతో, పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినట్టు సిట్ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక, ఇప్పటికే నిందితులు, బాధితుల స్టేట్మెంట్ ఆధారంగా సిట్ అధికారులు ప్రభాకర్ రావును విచారిస్తున్నారు. రేపు మరోసారి సిట్ ముందుకు ప్రభాకర్ రావు రానున్నారు. 2023 నవంబర్ 15 నుండి 30 వరకు అందిన సర్వీసు ప్రొవైడర్ డేటాలో 618 ఫోన్ నెంబర్లను సిట్ గుర్తించినట్టు తెలుస్తోంది. మరోవైపు ధ్వంసమైన హార్డ్ డిస్కులలో ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన డేటా ఉన్నట్టు సమాచారం. దీంతో, సిట్ అధికారులు హార్డ్ డిస్కులపైన ఆశలు పెట్టుకున్నారు. డేటా రిట్రైవ్, హార్డ్ డిస్కులోని రహస్యాలపై సిట్ ఆరా తీస్తోంది.

## కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై స్పందించిన కేటీఆర్

హైదరాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నలుగురికి డయాలసిస్ చేస్తున్నట్లు చెప్పారు. తాజాగా ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పెట్టారు. హైదరాబాద్‌లో కల్తీ కల్లు బారిన పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలను వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలి. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలి. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలి. మెరుగైన చికిత్స అందించాలి. కుటుంబం కోసం కాయకష్టం చేసే కష్టజీవులు కల్తీ కల్లు బారిన పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంతమంది చనిపోతే ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకాపోవడం చాలా దారుణం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలి అని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతికి కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల, రేషన్ కార్డుల వేరిఫికేషన్, భూ భారతి దరఖాస్తుల పరిష్కరణ, వన మహోత్సవంలో నాటే మొక్కల ప్రగతి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 8750 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 4806 గ్రౌండింగ్ అయి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, మిగిలిన ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వారంలోగా నిర్మాణ పనుల గ్రౌండింగ్ చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతోప్రోత్సహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజరులో ప్రధానమంత్రి అవాస యోజన గ్రామీన్ (పీఎంఏవైజి) పథకం క్రింద గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన ఇండ్ల వివరాలు పంచాయతీ సెక్రెటరీ లు సర్వే చేసి వెంటనే పీఎంఏవైజి ఆప్ లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో జిల్లానుమొందు వరుసలో ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఒక్కో మునిసిపల్, మండలాల వారీగా కేటాయించిన లక్ష్యం, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరీలు తెలిపిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రౌండింగ్ విషయంలో వెనుకంజలో ఉన్న మండలాలను గుర్తించి, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు.నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముగ్గు పోసి,ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు.ప్రజాపాలన దరఖాస్తుల రేషన్ కార్డుల జారీ వేరిఫికేషన్ పై మునిసిపల్, మండలాల వారిగా. కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లావ్యాప్తంగా 58,841 దరకాస్తులలో 41,836 దరకాస్తులు వేరిఫికేషన్ పూర్తయిందని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెల 13 నాటికి వేరిఫికేషన్ వంద శాతం పూర్తి కావాలని ఆదేశించారు. మీ సేవలో రేషన్ కార్డుల కొరకు జిల్లాలో 17866 దరకాస్తులు రాగా 7331 మంజూరు చేయడం జరిగిందని, మిగిలినవి వెంటనే వేరిఫికేషన్ చేయాలని సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని సాధించుటకు ప్రణాళిక ప్రకారం అనువైన ప్రదేశాన్నిగుర్తించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రణాళిక లను సిద్ధంచేసుకొని మన మహోత్సవ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలన్నారు. నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో సెంట్రల్ మీడియన్ లలో పెద్దఎత్తున ప్లాంటేషన్ కు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతిలో జిల్లావ్యాప్తంగా

50 850 వేల దరకాస్తులు రాగా అందులో 10 వేల 7 దరకాస్తులు మాత్రమే ఆర్ ఓ ఎఫ్ ఆర్ ప్రకారం చేయడం జరుగుతున్నదని, మిగిలిన దరకాస్తులలో 47843 సాదబైనమా, ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని అన్నారు.ఆర్ ఓ ఆర్ పరిధిలో ఉన్న పదివేల దరఖాస్తులను ఆగస్టులో 15లోగా వేరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలుచేపట్టాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఫాగింగ్ , పెద్ద ఎత్తున ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచుకొని ఎక్కడైతే నీరు నిల్వ ఉండి దోమలు వ్యాపిస్తాయో అక్కడ ఆయిల్ బాల్స్ ఉపయోగించాలన్నారు. గ్రామాలలో ప్రతిహోష్టి డే ను - డ్రై డే గా తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, గృహ నిర్మాణ శాఖ పిడి గణపతి, డిపిఓ కల్పన, రెవిన్యూ డివిజనల్ అధికారులు సత్యపాల్ రెడ్డి, రమాదేవి, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, బల్దియా ఉప కమిషనర్, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు,ఎంపిఓ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సురేఖ



వరంగల్ జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): శ్రీ భద్రకాళీ శాకాంబరీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నేడు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి కొండా సురేఖకి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూజించిన మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు పోవాలని మంత్రి కొండా సురేఖ ప్రార్థించారు.

## వయోవృద్ధుల మల్టీ డేకేర్ సెంటర్ కొరకు దరఖాస్తుల స్వీకరణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): జిల్లాలో వయోవృద్ధుల కొరకు మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నడుపుటకు స్వచ్ఛంద సంస్థలు మరియు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జే.యమ్.స్వర్ణలత లెనిన తెలియజేశారు. మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నిర్వహించే వారు తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ 2001 లేదా ద కంపెనీస్ యాక్ట్ 1956 లేదా ఇండియన్ ట్రస్టు యాక్ట్ 1882 ద్వారా రిజిస్టర్ అయి ఉండాలి. ఎన్.జి.ఓ. లేదా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్ లేదా చిల్డ్రన్స్ హోమ్ లేదా షెల్టర్ హోమ్స్ నిర్వహించడంలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఎన్జీవో లేదా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ బ్లాక్ లిస్టులో ఉండడం, ఫైనాన్సియల్ ఫ్రాడ్ కేసుల్లో ఉండటం వంటి దరఖాస్తులు తిరస్కరించబడును.

ఆసక్తి గల ఎన్జీవో లేదా సీనియర్ సిటిజన్ అసోసియేషన్స్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ పెట్టుకొనుటకు దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ వారి కార్యాలయం, ఐ.డి.ఓ.సి. పాల్వంచ నందు ఈ నెల 15 వ తేదీ లోగా అందించవలసిందిగా ప్రకటన ద్వారా తెలియజేశారు. వివరముల కొరకు 630 198 1960, 833 100 6010 నంబర్లను సంప్రదించగలరు.

## అర్హులకు సామాజిక భద్రత

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**అర్హులైన వారందరికీ పెన్షన్లు అందాలి**



జనగామ జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో అన్ని మండలాల ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు, మున్సిపల్ కమిషనర్ కు, బిల్ కలెక్టర్ లకి, పోస్టల్ డిపార్ట్మెంట్ సిబ్బందికి, టెక్నికల్ స్టాఫ్ కు, ఎన్ ఎఫ్ బి ఎస్ సిబ్బందికి చేయూత పింఛన్ల పైన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హాజరై మాట్లాడుతూ నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీం నందు జనగామ జిల్లాను ముందంజలో నిలబెట్టాలన్నారు. అర్హులైన పింఛన్దారుల వివరాలను పోర్టులో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు వితంతువులు,నేత కల్లుగీత, బీడీ కార్మికులకు,ఒంటరి మహిళల అవసరాలు తీర్చేందుకు చేయూత పెన్షన్ల రూపంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెర్ప్ పెన్షన్ విభాగం డైరెక్టర్ గోపాల్ రావు పెన్షన్ల వివిధ రకాలైన అర్హత అలాగే సాంకేతిక సమస్యలు ఉండే ఇన్స్టాంట్ స్పౌజ్, డార్మెంట్ అకౌంట్స్,శాశ్వత వలస తదితర అంశాల పైన జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చేయవలసిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డి ఆర్ డి ఏ పీడీ వసంత, అదనపు డి ఆర్ డి ఏ నూరుద్దీన్, DPMతదితరులు పాల్గొన్నారు.

## దశ దిశా కర్మలకు ఆర్థిక సాయం చేసిన శ్రీరామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్



మంగపేట, జూలై 10 (తీన్మార్ న్యూస్): బాధిత కుంటుంబం దగ్గరకు వెళ్లి సహాయం అందచేసిన ట్రస్ట్ సభ్యులు మంగపేట మండలం రామచంద్రుని పేట పంచాయితీలో గల సంఘం పెల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పిల్లల మర్రి సత్యం ఇటీవల అనారోగ్యంతో మరణించాడు స్థానికులు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ నాగ రమేష్ కి బాధిత కుటుంబం గురించి తెలియజేయగా వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు తరఫున దశ దిశ కర్మలకు ట్రస్టు సభ్యుల ద్వారా సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇందారపు రమేష్, కునారపు సాయి, జగదీష్, రమేష్, మంచర్ల సందీప్ నాగరాజు, సిద్దు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## బొజ్యానాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు భవిష్యత్తు**

**ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలను పునః ప్రారంభించిన కలెక్టర్**



వరంగల్ జిల్లా, జులై 10 (తీన్మార్ న్యూస్): భోజ్యానాయక్ తండ ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం నర్సంపేట మండలంలోని బోజ్య నాయక్ తండాలో గతంలో కొన్ని కారణాలవల్ల మూసివేయబడిన ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను కలెక్టర్ పునః ప్రారంభించారు. భోజన నాయక్ తండాలో పాఠశాల పునః ప్రారంభానికి కృషి చేసిన బొజ్య నాయక్ తండా వారియర్స్ యువకులు, తండావాసులకు పాఠశాలలో స్వచ్ఛందంగా తరగతులు నిర్వహిస్తున్న యువకులకు కలెక్టర్ అభినందించారు. బోజ్యానాయక్ తండలో నూతన ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా గురువారం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులకు లక్ష్యంతో చదివి భవిష్యత్తులో రాణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ఉద్దేశంతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నదని, నూతన భవనం నిర్మాణం కోసం చర్యలు తీసుంటామని కలెక్టర్ అన్నారు.“విద్య అనేది ప్రతి పిల్లవాడికి చేరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, గ్రామాల అభివృద్ధికి బడి వెలుగు మార్గమని అన్నారు. గంగాదేవి పల్లి, మరియాపురం గ్రామాలతో పోటీపడి బొజ్జ నాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, అందుకు కావలసిన ప్రణాళికలు రచించినచో ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారికి గణిత శాస్త్రం, ఆంగ్లంలో పలు ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదివి భావి భారత పౌరులుగా కావాలని ఆకాంక్షించారు. అంతకుముందు కలెక్టర్విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పలకలు పెన్నులు నోట్ బుక్స్ పెన్సిల్స్ లు దాత నర్సింహారెడ్డితో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎంఈఓ సారయ్య, తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, వారియర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించడానికి సహకరించండి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ**



మహబూబాబాద్, జులై 10 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో రెవిన్యూ మరియు పోలీసు అధికారులతో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలనే ప్రధాన ఏజెండాగా సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలంటే జైల్లో ఉన్న ఖైదీలను కోర్టులో సకాలంలో హాజరు పరచాలని, పెండింగ్ వారెంట్లు త్వరగా క్లియర్ చేయాలని, సాక్షులను సరైన సమయంలో హాజరు పరచాలని, విచారణ అధికారులు తమ తమ విచారణలను త్వరగా ముగించి కోర్టుకు సహకరించాలని తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సీనియర్ సివిల్ జడ్జి శాలిని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వాతి మురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరవపల్లి కృష్ణ తేజ్, తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి దీరజ్ కుమార్, డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, తొర్రూరు డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్, కృష్ణకిషోర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఎక్సైజ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి**

**కాలుష్యాన్ని నివారించేందుకు వన మహోత్సవాన్ని చేపట్టాలి**

**పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించాలి**






జనగామ జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): గురువారం స్టేషన్ ఘన్పూర్ లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాల లో చేపట్టిన వన మహోత్సవం -2025 పురస్కరించుకొని సంబంధిత అధికారులు పాల్గొనగా విద్యార్థినులతో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ మొక్కలు నాటి స్ఫూర్తి కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలి అన్నారు. జిల్లాలో వన మహోత్సవం కింద 30 లక్షల 50 వేలు మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటవలసిన ఆవశ్యకత ఉందన్నారు వేప, గుల్ మోహర్, సీతాఫలం, అల్లనేరేడు, చింత, కానుగ తదితర మొక్కలను ఎక్కువగా నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి విక్రమ్ కుమార్ మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి లత స్కూల్ సిబ్బంది విద్యార్థినీలు పాల్గొన్నారు.

## కాజీపేట ఆర్ఓబి పనులను త్వరగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్**



హనుమకొండ జిల్లా, జూలై 10 (తీన్మార్ న్యూస్): కాజీపేట ఆర్ఓబి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కాజీపేట ఫాతిమా నగర్ సమీపంలో కొనసాగుతున్న ఆర్ఓబి నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఆర్ఓబి నిర్మాణ పనులను, ఇంకా పూర్తి చేయాల్సిన పనులను గురించి ఆర్ అండ్ బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 72 మీటర్ల బోస్ట్రింగ్ గడ్డర్స్ ఒకవైపు పూర్తయిందని, మరొకవైపు పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ సురేష్ బాబు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆర్ఓబి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆర్ఓబి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ భూములను కాపాడుకుందాం

## భవిష్యత్ తరాలకు అందిద్దాం

## కేయూ భూముల రక్షణకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ




హనుమకొండ కేయు, జూలై 10 (తీన్మార్ న్యూస్): అన్యాక్రతమవుతున్న కాకతీయ యూనివర్సిటీ భూములను కాపాడాలని, యూనివర్సిటీ భూములకు హద్దులు నిర్మించి ప్రహరి గోడ నిర్మించాలని, గత నెల 17వ తారీఖున యూనివర్సిటీ పాలకమండలి యూనివర్సిటీ భూములలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాలకమండలి ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈరోజు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భారత్ బచావో రాష్ట్ర నాయకులు విశ్రాంత అధ్యాపకులు వెంగల్ రెడ్డి, ఓం బ్రహ్మంలు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం వివిధ అవసరాల దృశ్య కొంత భూమిని తీసుకున్నదని, కబ్జా కోరలు కొంత భూమిని ఆక్రమించారని ఇప్పుడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం 20 నుండి 30 ఎకరాల వరకు భూములు తీసుకోవడం వలన యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు భూముల కొరత ఏర్పడుతుంది కావున యూనివర్సిటీ భూములను ఇతరత్రా అవసరాలకు వినియోగించకుండా భవిష్యత్తు యూనివర్సిటీ అవసరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది కావున యూనివర్సిటీ అధికారులు ఈ విషయమై దృష్టి సారించి అన్యాక్రతమవుతున్న భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని వారన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల భాద్యులు పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎస్టిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డిఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, బిఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు శివకుమార్, బిఆర్ఎస్వి యూనివర్సిటీ నాయకులు పస్తం అనిల్ కుమార్ తదితరులు మాట్లాడారు. అలాగే ఈ కార్యక్రమంలో డిఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు సాయి, జశ్వంత్ లతో పాటు శేఖర్, సురేష్, నరేష్ లతో పాటు యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల



హనుమకొండ కేయు, జూలై 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేట - రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేట లో మే 2025 నెలలో నిర్వహించిన బి.ఏ., బి.కామ్, బి.ఎస్.సి (లైఫ్ సైన్సెస్) మరియు బి.ఎస్.సి (ఫిజికల్ సైన్సెస్) రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలఫలితాలు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామ్ చంద్రం మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల విడుదల చేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ కళాశాల అటానమస్ సెమిస్టర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినందుకు కాకతీయ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే. ప్రతాప్ రెడ్డి గారు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఫలితాల వివరాలు తెలిపారు. బి.ఎస్.సిలో 41.74%బీ బి.ఏ లో 51.85% బి.కామ్ లో 39.02% ఓవరాల్ గా 42.62%బీ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు %ఌ=% కోడ్ మరియు లింక్ ద్వారా అందుబాటులో కళాశాల వెబ్సైట్ లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ కళాశాల విద్య కమీషనర్ శ్రీమతి ఎ.శ్రీదేవసేన, %×ూూ%కి, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాల భాస్కర్, అందించిన సహాయ సహకారాలకు ధన్యవాదాలు తెలిపారు. ఫలితాల విడుదల ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తో పాటు పరీక్షల నియంత్రణ అధికారి శ్రీ ఎస్. కమలాకర్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. రాజీరు, డా. భద్రు స్టాఫ్ సెక్రటరీ రహీముద్దీన్ పాల్గొన్నారు.

# జాతీయ మత్స్య కృషి వలూలా దినోత్సవ శుభాకాంక్షలు



మహబూబాబాద్ జిల్లా, జులై 10 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో జరిగిన జాతీయ మత్స్య కృషి వలులా దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి వీరన్న జిల్లాలోని 18 మండలాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శులు మరియు మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సోదరీమణులకు జాతీయ మత్స్య రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా చెరువులు నిండుకుండలా ఉండి చెరువులలో చేపల అభివృద్ధి రోజురోజుకు పెరుగుతూ ఈరోజు మత్స్యకారులు ఆర్థిక బాటలో నడవడం ప్రారంభమైనదని, 202 మత్స్య పరిశ్రమకు సహకార సంఘాలు ఉన్నప్పటికీ వాటి విస్తీర్ణం బట్టి చెరువులలో చేపల పెంపకం సజావుగా సాగుతూ వస్తున్నదని మత్స్యకారులు చెరువులలో చేపలు వదలడమే కాదు వాటిని పెంపకంలో కూడా మెలుకువలు తెలుసుకొని మత్స్య సంపద జిల్లాలో పెంచవలసిందిగా జిల్లా మత్స్యశాఖ అధికారి భానోత్ వీరన్న కోరారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ గత సంవత్సరం అకాల వర్షంతో జిల్లాలోని 43 చెరువులు కుంటలు తెగిపోయి తీవ్రమైన బాధలో ఉన్నటువంటి సొసైటీలకు తెలంగాణ ప్రభుత్వము ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని వారు కోరారు జిల్లాలో అకాల వర్షం కురవడం వలన మత్స్యకారుల యొక్క పనిముట్లు అన్నీ కూడా వరదలు కొట్టుకుపోయి ఈరోజు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నటువంటి పరిస్థితి ఏర్పడింది వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఆర్థిక సాయం ప్రకటించాలని వారు కోరారు మత్స్యకారుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా పథకాలను ప్రవేశపెట్టి వారికి సాయపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వము మత్స్యకారుల కొరకు వాహనాలు చేపల వంటకాల కొరకు క్యాంటీన్లు ఫిష్ ట్రావెల్స్ నూతన చెరువుల పునరుద్ధరణ తదితర పథకాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణలో ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని మత్స్య మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు పెద్ది సైదులు ముదిరాజ్, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య, మహబూబాబాద్ కేంద్రం లోని మత్స్య పారిశ్రమకు సహకార సంఘ ప్రధాన కార్యదర్శి పిల్లి దశరథం, %ఐఖీజూ% ప్రమోటార్ లింగాల పిచ్చయ్య ముదిరాజ్, రాజోలు సొసైటీ అధ్యక్షులు బసనబోయిన వెంకన్న ముదిరాజ్, %ఐఖీజూ% ప్రమోటార్ చిన్నబోయిన ఆంజనేయులు ముదిరాజ్ ఉప్పరగూడెం సొసైటీ అధ్యక్షులు చేన్నబోయిన ఉపేందర్ ముదిరాజ్ పిల్లి వెంకటస్వామి మత్స్య శాఖ అధికారులు యాకుబ్ గారు విష్ణు గారు సురేష్ గారు వేణు గారు రాజు గారు తదితరులు మత్స్యకారులు పాల్గొన్నారు.


# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

## మలేరియా, డెంగ్యూల ప్రభావం

**శ్రీకాకుళం :** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# అటవీ సంపదను పునరుద్ధరణకు చర్యలు

## ప్రతి ఒక్కరూ కనీసం 20 మొక్కలు నాటాలి.. అప్పడే లక్ష్యం చేరుకోగలం



**ఆదిలాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు తెలిపారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని అటవీ అధికారులు తెలిపారు. పర్యావరన హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెపంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు.

# దేశ చిత్రపటంలో తెలంగాణను తొలగించడం ఏంటి

## బహుమతి మ్యాపులో ఆంధ్రప్రదేశ్ మాత్రమే.. దారుణం

## నేరుగా ప్రధాని మోదీకే ట్వీట్ చేసిన కేటీఆర్





తెలంగాణ బ్యూరో, జులై 10 (తీన్మార్ న్యూస్): భారతదేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడం ఏంటని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణమన్నారు కేటీఆర్. ఇలా తమ చరిత్రను తొలగిస్తే ఇక మేమెవరం? అని నేరుగా ప్రధాని మోదీకే ట్వీట్ చేశారు కేటీఆర్. తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బీజేపీ అధికారిక విధానమా? అని ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు కేటీఆర్. ఈ మేరకు పలు పశ్నలు సంధించారే కేటీఆర్. దశాబ్దాలపాటు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో తమకు సరైన చోటు దక్కడం కోసం, ప్రత్యేక భౌగోళిక గుర్తింపు, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ. అయితే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మా సాంస్కృతిక గుర్తింపుని అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణం. తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని లెక్కచేయకుండా చేసిన చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది పూర్తిగా అనుచితమైంది. భారతదేశ చిత్రపటం నుంచి మా చరిత్రనే తొలగిస్తే మేమెవరం?, ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా?, లేదా ఈ చర్య కేవలం ఒక పొరపాటా అనే విషయంపై మీరు వెంటనే స్పష్టత ఇవ్వాలి. ఇది తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను, బలిదానాలను అగౌరవపరచడమే కాకుండా మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి. పొరపాటైతే, తెలంగాణ ప్రజలని అపహాస్యం చేసినందుకు మీ పార్టీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండళ్లకు కొత్త దిశ

## ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధికి మండళ్లు కీలకం

## మండళ్ల బలోపేతానికి నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ ప్రారంభం

## ఆవిష్కరణలు, అభివృద్ధికి రాష్ట్రాలకు ఊతం

## కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, నీతి ఆయోగ్ కీలక ప్రకటన

## న్యూఢిల్లీలో రోడ్‌మ్యాప్ ఆవిష్కరణ




న్యూఢిల్లీ, జులై 10 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండళ్లను బలోపేతం చేయడానికి నీతి ఆయోగ్ గురువారం న్యూఢిల్లీలో ఒక రోడ్‌మ్యాప్‌ను ప్రారంభించింది. శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికె సరస్వత్‌లతో కలిసి దీనిని ప్రారంభించారు. ఆయోగ్ ప్రకారం, భారతదేశం అంతటా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండళ్ల పాత్ర మరియు పనితీరును బలోపేతం చేయడానికి ఈ రోడ్‌మ్యాప్ ఒక వ్యూహాత్మక దృక్పథాన్ని వివరిస్తుంది. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండళ్లను ప్రాంతీయ ఆవిష్కరణలు, శాస్త్రీయ పురోగతి మరియు స్థిరమైన అభివృద్ధికి బలమైన సహాయకులుగా మార్చడానికి అవసరమైన నిర్మాణాత్మక అంతరాలు, అవకాశాలు మరియు సంస్కరణ ప్రాధాన్యతలను ఇది సంగ్రహిస్తుంది. ఈ మండళ్ల ప్రభావం మరియు ప్రతిస్పందనను పెంచడానికి నిర్మాణాత్మక సంస్కరణలు, సామర్థ్య నిర్మాణ ప్రయత్నాలు మరియు వ్యూహాత్మక భాగస్వామ్యాల సమగ్ర సమ్మేళనం దీనికి అవసరం.

# విద్యార్థులు నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

## ప్రొఫెసర్ యం. స్వర్ణలత



హనుమకొండ కేయు, జూలై 10 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధిస్తే సంతోషంగా ఉంటుందని ప్రొఫెసర్ యం.స్వర్ణలత అన్నారు. కేయూ లోని సోషియాలజీ, సోషల్ వర్క్ డిపార్టుమెంటులో గురు పూర్ణిమ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రొఫెసర్, లెక్చరర్స్ ను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్వర్ణలత మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గౌరవమైనదని, విద్యార్థులను మంచి మార్గం వైపు నడిపించడంలో ముఖ్యపాత్రను పోషిస్తున్నారని, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని, చెడు వ్యసనాలు వైపు వెళ్లకూడదని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని, కోరారు. లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని, విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమన్నారు. సమాజంలో ఉన్న రుగ్మతులను తొలగించడం కోసం, నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని, సమాజానికి ఉపయోగపడేలా పనులు చేయాలని, జీవితంలో మంచి స్థాయిలో ఉంటే చదువు నేర్పిన ఉపాధ్యాయులకు సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ డాక్టర్ వాసు, సాహితీ, సుభాష్, రజిత, ప్రసన్న, యాస్మిన్, పరిశోధక విద్యార్థులు డి. తిరుపతి, రాజారాం, కందికొండ తిరుపతి, ఈ.రాజు, శ్రీదేవి, స్రవంతి విద్యార్థులు పాల్గొన్నారు.

# రుణంపైనే ఆధారపడ్డ రైతన్నలు

### సకాలంలో రుణాలు అందక తంటాలు



**కరీంనగర్,జూలై 10 :** పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్‌క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతులుంటారు కాబట్టి వీరిరికూడా వచ్చే వానాకాలం పంటరుణాన్ని దరిచేర్చేలా చర్యలుండాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, ధీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపులైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

# జగన్మోహన్ రావు తదితరులకు రిమాండ్

### చర్లపల్లి జైలుకు తరలించిన పోలీసులు



**హైదరాబాద్,జూలై10 :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికలో అక్రమాల కేసులో అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు మరో నలుగురికి మల్కాజ్‌గిరి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. వారిని అరెస్టు చేసినట్లు సీఐడీ గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. జగన్మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, సునీల్, రాజేందర్ యాదవ్, కవితకు వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడైనట్లు సీఐడీ చెబుతోంది. అలాగే అవినీతి కూడా జరిగినట్లు తేల్చింది. ఈ క్రమంలో వీరికి కోర్టు రిమాండ్ విధించింది. నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించగా, కవితను చంచల్‌గూడా మహిళా జైలుకు తరలించారు.

# ఆపరేషన్ కగార్‌పై మాట్లాడితే అర్బన్ నక్సల్ అన్నారు

### పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన



**హైదరాబాద్,జూలై 10 :** ఆపరేషన్ కగార్‌పై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన వెంటనే తనపై అర్బన్ నక్సలైట్, దేశద్రోహి ముద్ర వేశారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ, మఖ్దూమ్ తెలుగు నేలపై జన్మించిన గొప్ప కమ్యూనిస్టు నేత అని కొనియాడారు. సింగరేణి కార్మిక ఉద్యమంతో ఆయనకు ఆత్మీయ సంబంధం ఉందని తెలిపారు. 1974 ఫిబ్రవరి 17న జరిగిన ఈ కార్యాలయ పునాది కార్యక్రమానికి అప్పటి కాంగ్రెస్ మంత్రులు హాజరయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్–కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదని స్పష్టంచేశారు. నేను ఎప్పటినుంచో కమ్యూనిస్టు భావజాలానికి మద్దతుగా ఉన్నాను. ఈ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవాలంటే లెఫ్ట్ శక్తులు బలపడాలి. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో పాటు– కమ్యూనిస్టులతో కలిసి విజయాన్ని సాధించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన ఆయన, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ భూసంపదను కార్పొరేట్ కంపెనీలకు దక్కించేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా, కేంద్రం మానవతా దృక్పథంతో కాకుండా మారణయత్నాలతో ముందుకు వెళుతోంది. ఇది బాధాకరం అని అన్నారు. ఇక ఎలక్షన్ కమిషన్ వ్యవహారాలపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా ఈ సంస్థ మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి శోచనీయ పరిణామమని విమర్శించారు.

# పెన్షన్ డబ్బుల కోసం కిరాతకం

### తల్లిని బండరాయితో మోది హత్య

**నిజామాబాద్,జూలై 10 :** పింఛన్ డబ్బుల కోసం తల్లిని ఓ దుర్మార్గ కుమారుడు హత్య చేసాడు. ఈ సంఘటన నిజామాబాద్ జిల్లాలోని వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మోస్రా మండలం జలాల్పూర్ గ్రామానికి చెందిన గొల్ల సాయవ్వ (57) కుమారుడు గొల్ల సాయిలు తల్లి పింఛన్ డబ్బుల విషయంలో గొడవ పడి డబ్బుల ఇవ్వకపోవడంతో తల్లిని బండరాయితో తల, ఛాతి, కడుపు మీద బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన చుట్టుపక్కల కాలనీవాసులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సాయవ్వను బోధన్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి వైద్యులు పరీక్షించగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి చెల్లెలు కొడుకు జెట్టి మహేష్ పోలీసులకు ఫిర్యాదు మేరకు వర్ని ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

### మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల



**శ్రీశైలం,జూలై 10 :** కృష్ణ బేసిన్‌కు వరద ప్రవాహం యధావిధిగా కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయానికి 1,62 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుండగా శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన ఉన్న జూరాల12 సుంకేసుల ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంనకు లక్ష అరవై వేల క్యూసెక్కుల ఇన్ ఎ÷–లో కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైపుకు 81 వేల క్యూసెక్కులు కుడి ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 67 వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో నాగార్జునసాగర్ కు మొత్తం 1లక్ష 48 వేల క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. ఎగువ కర్ణాటక మహారాష్ట్ర ను కురుస్తున్న వర్షాలకు జూరాల ఎగువన ఉన్న అలమట్టి నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్ ఎ÷–లో సాగుతుంది. నారాయణపురం డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు ఒక లక్ష పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నడంతో 12 గేట్ల ఎత్తి శ్రీశైలం వైపుకు వెళుతున్నారు. జూరాలలో ఎగువ దిగువ విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అనంతరం మరో 29వేల కేశకులను వదులుతున్నారు. సుంకేసుల బ్యారేజ్ కి ఎక్కువ తుంగభద్ర నది నుంచి 55 వేల క్యూసెక్కుల ఇన్ ఎ÷–లో వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలం వైపుకు 52 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుపై ఆధారపడిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 1600 కి శక్తుల నీరు ఎత్తిపోస్తుండగా... రాయలసీమకు పోతిరెడ్డిపాడు ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసీలకు గాను ప్రస్తుతం 202 టిఎంసిల మేర నీరు నిలువ ఉంది. అడుగులలో 885 అడుగులకు గాను 882.70 అడుగులలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో ఇంతే స్థాయి–ులో నీటిని నిలువ ఉంచుతూ శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు– ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి అనుగుణంగా గేట్లు– తెరుస్తూ మూస్తూ వస్తున్నారు. గురువారం మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు– ఇదే మోతాదులో కృష్ణా బేసిన్ కు వరద కొనసాగే అవకాశాలు ఉన్నట్లు– అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఎసిబికి చిక్కిన నిమ్జ్ అధికారులు

**సంగారెడ్డి,జూలై10 :** జిల్లాలో అవినీతి నిరోధక శాకు రెండు పెద్ద అవినీతి తిమింగళాలు చిక్కాయి. గురువారం జహీరాబాద్ లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్) అధికారులు ఎసిబి వలలో పడ్డారు. నిమ్జ్ డిప్యూటీ– కలెక్టర్ రాజు, డిప్యూటీ– తహసీల్దార్ సతీశ్ లు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టు–బడ్డారు. భూసేకరణ పరిహారం చెక్కులు ఇచ్చేందుకు లంచం అధికారులు డిమాండ్ చేయడంతో బాధితరులు ఎసిబిని ఆశ్రయించారు. దీంతో పక్క ఎ÷–లాన్ ప్రకారం.. బాధితుల నుంచి 65 వేల రూపాయలు లంచంగా తీసుకుంటు–ండగా అధికారులు రాజు, సతీశ లను ఎసిబి పట్టు–కుంది. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు విచారిస్తున్నారు.

# స్కూలు బస్సులో మంటలు

### విద్యార్థులకు తప్పిన ముప్పు

**సంగారెడ్డి,జూలై 10 :** సంగారెడ్డి జిల్లాలో కిష్టారెడ్డిపేటలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో మంటలు చెలరేగాయి. ఔటర్ రింగ్ రోడ్డు కు సమీపంలో రెడ్లగడ్డలో విద్యార్థులను బస్సులోకి ఎక్కిస్తున్న క్రమంలో మంటలు అంటుకున్నాయి. వెంటనే విద్యార్థులను బస్సు డ్రైవర్, క్లీనర్ కిందకు దించేశారు. చూస్తుండగానే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశాయి. బస్సు పాక్షికంగా కాలిపోయిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రాణాపాయ తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ తోనే బస్సులో మంటలు అంటుకున్నట్టు– సమాచారం.



# జనాభా నియంత్రణ తక్షణావశ్యకత!

ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. ప్రపంచ జనాభా ఇప్పటికే 800 కోట్లు దాటింది. భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లకు చేరుకుంది. ఇందులో పెరుగుదలే తప్ప తక్కు ఉండదని చెప్పొచ్చు. జనాభా పెరుగుదలతో పాటు కనీస వసతులు, వనరులు లేకపోవడంతో భారతదేశం ఇంకా పేదరికంలోనే మగ్గుతోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగు దలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయా దేశాలు తమ దేశాల వనరుల ఆధారంగా నియంత్రణ చర్యలు పాటించాలి.నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్టికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలుగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి. మనదేశంలో త్వరలోనే జగనగణన జరుగనుంది. ఈ క్రమంలో ఈ వానాకాల పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చైనాలాగా జనాభా నియంత్రించకపోతే రానున్నరోజుల్లో బతకడం దుర్లభంగా మారనుంది. చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఆహారధాన్యాల కొరత ఏర్పడనుంది. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇలా ఎన్నో విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ....తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పూనుకోవాలి. పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళ్ళు, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిట లాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. అగ్ర రాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా...నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవాటు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచించారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది సకాలంలో చర్చించాల్సిన అతిపెద్ద సమస్యగా చూడాలి. జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా వాటంతట అవే పెరుగుతాయని గుర్తించాలి. ప్రతి కుటుంబం తమకు తాముగా జనాభా నియంత్రణకు కట్టుబడాలి. ప్రభుత్వాలు జనాభా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేయాలి. లేకుంటే మరో పదేళ్లలో ఈ సమస్యను పరిష్కరిచలేని దశకు చేరుకోగలం.

# రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం

**2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభం**

**వచ్చే ఐదేళ్లలో పట్టాలకెక్కనున్న వెయ్యి కొత్త రైళ్ళు**

**కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,జూలై10 :** రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో కొత్తగా వెయ్యి రైళ్లను పట్టాలు ఎక్కించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం న్యూఢిల్లీలో వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో ఈ కొత్త రైల్వే సర్వీసులు ప్రారంభిస్తామని అన్నారు. 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభించడమే భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రైల్వే ఎగుమతులు ద్వారా ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక రైల్వే ద్వారా సరుకు రవాణాలో ఇది దేశానికే వెన్నుముకగా నిలవనుందన్నారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 35 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ను నిర్మించామని వివరించారు. ఇది జర్మనీ దేశంలోని మొత్తం రైల్వే ట్రాక్‌తో సమానమని సోదాహరణగా చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 5,300 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను భారతీయ రైల్వే నిర్మించిందని చెప్పారు.ఏడాదిలో 30 వేల వ్యాగిన్లు, 15వందల లోకోమోటివ్ లను భారతీయ రైల్వే తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తర అమెరికా, యూరప్ తయారు చేస్తున్న రైల్వే వ్యాగిన్ల కంటే అధికమన్నారు. మరోవైపు భారతీయ రైల్వేలో పెట్టబడులు రూ. 2 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లు ఏగబాకాయని చెప్పారు. అందులో రూ. 20 వేల కోట్లు.. పీపీపీ ద్వారా అదనంగా వచ్చాయని ఆయన వివరించారు. జపాన్ సహకారంతో బుల్లెట్ రైలు తయారు చేస్తున్నామన్నారు. ఇది 2026 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. 2027లో దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇక ఏడాదిలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 170 నుంచి 30కి తగ్గాయన్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. రైలు ప్రమాదాలు 80 శాతం మేర తగ్గాయని వివరించారు. ట్రాకులు అప్ గ్రేడ్ చేయడం.. పాయింట్స్, సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రతి రోజు సమీక్షించడం ద్వారా ఈ ప్రమాదాల నివారించడం సాధ్యమైందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

## భార్యను తొక్కి చంపేసిన కిరాతకుడు

**బెంగళూరు, జూలై10 :** ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణానికి తెగించాడు. తన భార్య మెడపై కాలుతో తొక్కి చంపేశాడు. ఈ సంఘటన బెంగళూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసపూర్‌లో పద్మజ-హరీష్ కుమార్ అనే దంపతులు నివసిస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తుండగా భార్య ఓ ప్రైవేటు- కంపెనీలో జాబ్ చేస్తోంది. హరీష్ గత కొన్ని నెలల నుంచి జాబ్ మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. షాపింగ్‌కు వెళ్లొచ్చిన భార్యతో భర్త గొడవకు దిగాడు. దంపతులు మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో భార్య గొంతునులిమిన నెట్టేశాడు. ఆమె కిందపడిన వెంటనే మెడపై కాలుతో తొక్కడంతో ఊపిరాడక భార్య ఘటనా స్థలంలోనే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నోయిడా కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**నోయిడా,జూలై10 :** నోయిడా సెక్టార్ 8లోని ఒక రసాయన కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఫ్యాక్టరీ ఆవరణ నుండి పెద్ద ఎత్తున దట్టమైన పొగలు ఎగసిపడటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురియ్యారు. భారీగా మంటలు చెలరేగుతుండటంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక దళాలు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించాయి. అగ్నిమాపక దళం తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు- అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కార్మికులను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## పురోగతిలో అమెరికాతో వాణిజ్య చర్చలు

**వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్**

**న్యూఢిల్లీ,జూలై10 :** అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు- కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి.తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఒప్పందం యొక్క మొదటి దశను సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగించడానికి లక్ష్యంగా పెట్టు-కున్నట్లు- చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు 26 దేశాలతో 14కి పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలు చేసిందని అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్కెట్లతో అనుసంధానం అవుతున్నామని.. ఇప్పటికే యూకేతో ఒక ఒప్పందాన్ని ముగించినట్లు- పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో కూడా చర్చల దశలో ఉన్నట్లు- తెలిపారు. ఇక భారతదేశం.. చిలీ, పెరూ వంటి లాటిన్ అమెరికన్ దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నట్లు- చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియా, యూఏఈలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయని.. న్యూజిలాండ్‌తో కూడా చర్చలు జరుపుతున్నట్లు- వెల్లడించారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పెద్ద ఎత్తున ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు- ఆయన చెప్పుకొచ్చారు. ప్రిల 2న ట్రంప్.. ఆయా దేశాలపై సుంకాలు విధించారు. అయితే ఆయా దేశాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో ఈ నిర్ణయాన్ని మూడు నెలల పాటు- తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఆ డెడ్‌లైన్ మొన్న జూలై 9తో ముగిసింది. ఈ మేరకు ఆయా దేశాలను హెచ్చరిస్తూ లేఖలు కూడా రాశారు. ఇక రెండు మిత్ర దేశాలకు ఇప్పటికే సుంకాలు విధించారు. మిగతా దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు విధించారు. ఈలోపు అమెరికాతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమెరితో యూకే, వియత్నాం మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయి. చైనా మాత్రం పరస్పరం తాత్కాలింగా తగ్గించుకోవాలని నిర్ణయం తీసుకున్నాయి.

# చైనాలో అధికార మార్పిడి తప్పదా

**కొంతకాలంగా అజ్ఞాతంలోకి జిన్‌పింగ్**

**జిన్‌పింగ్‌ను తప్పించేపనిలో కమ్యూనిస్టులు**

**ప్రపంచవ్యాప్తంగా చైనా రాజకీయాలపై చర్చ**

**బీజింగ్,జూలై 10 :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు-పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉంది. యువతకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఆర్థిక సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనడంలో జిన్‌పింగ్ విఫలమయ్యా రనే విమర్శలు పార్టీలోనే పెరుగుతున్నాయి. జిన్‌పింగ్ అధికారాన్నంతటినీ కేంద్రీకృతం చేశారు. తన గుప్పిట్లో ఉంచుకున్నారు. ఇది పార్టీలో అసమ్మతి రాజేసింది. మాజీ నాయకులు, సీనియర్ పార్టీ సభ్యులు జిన్‌పింగ్ నిర్ణయాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీలోని వివిధ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడం వల్లే, జిన్‌పింగ్ తలొగ్గి ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చైనాలో అధికార మార్పిడి ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో జరిగే సాధారణ ఎన్నికల పక్రియకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అన్ని ప్రభుత్వ సంస్థలు, సైన్యం, న్యాయవ్యవస్థ, మీడియా... ఇలా అన్నీ పార్టీ నియంత్రణలోనే పనిచేస్తాయి. పార్టీ నాయకుల ఎంపిక, పదవీ విరమణ వంటి నిర్ణయాలు పార్టీలోని అత్యున్నత స్థాయి కమిటీలైన పొలిట్‌బ్యూరో, దాని స్టాండింగ్ కమిటీలే తీసుకుంటాయి. ఒకవేళ జిన్‌పింగ్ వైదొలిగితే ఆయన స్థానంలో ఎవరు బాధ్యతలు తీసుకుంటారనేదానిపై స్పష్టత లేదు. జిన్‌పింగ్ వారసుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నవాళ్లలో ప్రస్తుతం చైనా ప్రధానిగా లీ కియాంగ్ ముందున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడు. లీ కియాంగ్ తో పాటు- డింగ్ జుయెజియాంగ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. చైనాలో అధికార మార్పిడి పక్రియ చాలా రహస్యంగా సాగుతుంది. ఒకవేళ జిన్‌పింగ్ అధికారం నుంచి తప్పుకుంటే, అది చైనా రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.





# బ్రిడ్జి కూలిన ఘటనలో 15 మంది మృతి

**మరో ముగ్గురి కోసం గాలింపు ముమ్మరం**

**ఘటనపై విచారణ జరపాలని ప్రియాంక డిమాండ్**

**గాంధీనగర్,జూలై 10 :** ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్ లో ఘోర దుర్ఘటన జరిగింది. వడోదర జిల్లాలోని పద్రా పట్టణ సమీపంలో గల మహిసాగర్ నదిపై నిర్మించిన 40 ఏళ్ల పురాత వంతెన బుధవారం ఉదయం కుప్పకూలిన విషయం తెలిసిందే. గంభీర బ్రిడ్జిలోని కొంత భాగం నదిలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య తాజాగా 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తుల ఆచూకీ ఇంకా లభించ లేదని జిల్లా కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు. 'బ్రిడ్జి కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వారి కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయని తెలిపారు. 900 మీటర్ల పొడవున్న ఈ వంతెనలోని రెండు పిల్లర్ల మధ్య ఉన్న స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలి నీటిలో పడిపోయింది. దీంతో ఆ స్లాబ్ మీద ఉన్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఓ ఆటోరిక్షా, మరో బైక్ నీటిలో పడిపోయినట్టు- పేర్కొన్నారు. అప్పుడే స్లాబ్ చివరివరకూ వచ్చిన ఓ పెద్ద ట్యాంకర్ ప్రమాదకరంగా వేలాడిందని, మరో వాహనం కూడా ఇలాగే నిలిచిపోయిందని తెలిపారు. సెంట్రల్ గుజరాత్, సౌరాష్ట్రను గంభీర వంతెన కలుపుతుంది. తాజా ఘటనతో ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలావుంటే వడోదరలో గంభీర బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారన్న ప్రియాంక గాంధీ.. భారీ బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ప్రాంతంలో రెండవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, అదే సమయంలో దర్యాప్తు కూడా జరగాలని ప్రియాంక గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ అంశంపై స్పందించారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుజరాత్ వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఇటీవలి విషాదాలు నాయకత్వ సంక్షోభం, అవినీతి, అసమర్థత ఫలితంగా జరిగాయని ఆరోపించారు.

## ఢిల్లీ సహా ఉత్తరాదిలో స్వల్ప భూకంపం

**హర్యానాలోని జజ్జర్ కేంద్రంగా భూకంపం**

**రిక్టర్ స్కేలుపై తీవ్రత 4.4 గా ఉన్నట్లు గుర్తింపు**

**న్యూఢిల్లీ,జూలై 10 :** దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిలో పలు ప్రాంతాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. గురువారం ఉదయం 9.04 గంటలకు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తోపాటు దాని సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లో భూమి కంపించింది. దీని తీవ్రత 4.4 గా ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం హర్యానాలోని జజ్జర్‌లో ఉన్నదని తెలిపింది. భూమి అంతర్భాగంలో 10 కిలోమీటర్లలోతులో ప్రకంపనలు సంభవించాయని పేర్కొంది. భూకంపంతో భయందోళనలకు గురైన ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. ఢిల్లీ రాజధాని పరిధిలోని నోయిడా, గజియాబాద్‌తోపాటు- హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కూడా భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. ఇలా ఉత్తర భారత వాసులను భూకంపం వణికించింది. దేశ రాజధాని దిల్లీ, ఎన్‌సీఆర్ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం భూప్రకంపనలు సంభవించాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హరియాణాలోని ఝజ్జర్‌కు ఈశాన్యాన 3 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు- జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. ఈ ప్రాంతం పశ్చిమ దిల్లీకి కేవలం 51 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో దేశ రాజధానిలో ప్రకంపనలు భారీగానే చోటుచేసుకున్నాయి. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. గతంతో పోలిస్తే ఈసారి ప్రకంపనల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉన్నట్లు- తెలుస్తోంది. భూమి కంపించడంతో అనేక చోట్ల ప్రజలు, కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించ లేదని అధికారులు తెలిపారు. మరోవైపు, దిల్లీలో బుధవారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ప్రకంపనలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటు ఎన్డీఆర్ఎఫ్ దీనిపై అడ్వైజరీ జారీ చేసింది. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఇలాంటి సమయాల్లో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు దిగి కిందకు రావాలని సూచించింది.

## గురుగ్రామ్‌లో కుంభవృష్టి

**రహదారులు జలమయం..ఇంటికే పరిమితమైన జనం**

**న్యూఢిల్లీ,జూలై 10 :** భారీ వర్షాలతో గురుగ్రామ్ జలమయం అయింది. పలు ప్రాంతాలలో మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. దీనితో వేలాది మంది ఇళ్లకు పరిమితం కావల్సి వచ్చింది. గురువారం గురుగ్రామ్‌లో అధికారులు జాగ్రత్త చర్యలకు సూచనలు వెలువరించారు. కార్పొరేట్ ఆఫీసులు, ప్రైవేటు- సంస్థల ఉద్యోగులు ఇంటి నుంచే పనికి దిగారు. ఈ ఆకాశహర్మాల నగరంలో అనేక చోట్ల నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ ఆగింది. నగరపు దక్షిణ ప్రాంతపు రహదారిపై బీరు సీసాలతో వెళ్లుతున్న ట్రక్కు గుంతలు పడ్డ రోడ్డులో కూరుకుపోయింది. దీనితో బీరు బాటిల్స్‌ను రక్షించుకునేందుకు డ్రైవర్ ప్రయత్నించాల్సి వచ్చింది. ఘటనలో ఎవరూ గాయపడలేదు. ప్రాంతానికి చేరుకున్న క్రేన్ సాయంతో అతి కష్టం మీద ట్రక్కును పైకి లాగారు. పలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కొన్ని ప్రైవేటు- విద్యాసంస్థలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాయి. బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వర్షం ఆరంభం అయింది. రాత్రింతా పడుతూనే ఉంది. 12 గంటల వ్యవధిలో నగరంలో 133 మిమిల వర్షపాతం రికార్డు అయిందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతానికి ఐఎండి ఆరంజ్ అలర్ట్ వెలువరించింది. ఇక్కడి జాతీయ రహదారులలో ఆరు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సరిగ్గా పనిచేయడం లేదని, అందుకే పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయని నగర ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్థితిని తెలిపే ఫోటోలను పెట్టారు. హర్యానాలోని ఇతర ప్రాంతాలు అంబాలా, హిసార్, కర్నాల్ , రొహతక్ , భివానీలలో కూడా భారీ వర్షాలు పడ్డాయని అధికారులు తెలిపారు.



# సిరీస్ పట్టేసింది

## చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు

## ఇంగ్లాండ్‌పై టీమ్ఇండియా గ్రాండ్ విక్టరీ

భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్?లో మరో మ్యాచ్? మిగిలుండగానే 3- 1 తేడాతో నెగ్గింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాలుగో మ్యాచ్?లో ఇంగ్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 127 పరుగుల లక్ష్యాన్ని 17 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్మృతి మంధాన (32 పరుగులు), షఫాలీ వర్మ (31 పరుగులు), రోడ్రిగ్స్ (24 పరుగులులి), హర్మన్‌ప్రీత్ కౌర్ (26 పరుగులు) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. భారత బౌలర్ల దెబ్బకు ఇంగ్లాండ్ విలవిల్లాడింది. సోఫియా డంక్లీ (22 పరుగులు) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో రాధా యాదవ్ 2, శ్రీ చరణి 2, అమన్‌జోత్ కౌర్, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు. కాగా, ఇరుజట్ల మధ్య ఐదో మ్యాచ్ జూలై 12న జరగనుంది. ఈ మ్యాచ్?కు ఎడ్జ్‌బాస్టన్ వేదిక కానుంది. మొదటి రెండు టీ20ల్లో నెగ్గిన టీమ్ఇండియా మూడో మ్యాచ్‌లో త్రుటిలో విజయాన్ని చేజార్చుకుంది. మూడో మ్యాచ్?లో భారత్ 5 పరుగుల స్వల్ప తేడాతో ఓడింది. ఇక నాలుగో టీ20లో టీమ్ఇండియా కమ్?బ్యాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసి ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ పట్టేసింది. అయితే ఇంగ్లాండ్?పై సిరీస్ నెగ్గడం భారత మహిళల జట్టుకు ఇదే తొలిసారి. ఇరుదేశాల మధ్య ఇప్పటి వరకు ఆరు ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగాయి. ఇందులో అన్ని సిరీస్‌లు ఇంగ్లాండే గెలిచింది. 2006లో డర్బీలో ఇంగ్లాండ్‌తో జరిగిన ఏకైక టీ20లో మాత్రం భారత్ గెలుపొందింది.

**చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్..**

మాంచెస్టర్‌లో జులై 9న జరిగిన నాల్గవ టీ20। మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఇంగ్లాండ్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3-1 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్?కు జీవితంలో మర్చిపోలేని విధంగా మారింది. ఆమె గతంలో మిథాలీ రాజ్ పేరిట ఉన్న ఒక ఆల్-టైమ్ మ్యాచ్‌ల రికార్డును సమం చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇప్పుడు భారత్ తరఫున 333 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఇది మిథాలీ రాజ్‌తో సమానంగా భారత మహిళా క్రికెటర్‌కు అత్యధిక మ్యాచ్‌లు. మరో ఒక్క మ్యాచ్ ఆడితే, ఆమె భారత మహిళల క్రికెట్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా నిలవనుంది. 36 ఏళ్ల హర్మన్‌ప్రీత్ 2009 మార్చి 7న అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా కొనసాగుతోంది. బ్యాట్, బంతి రెండింటితోనూ ఆమె అదరగొడుతుంది. ఇప్పటివరకు ఆడిన 6 టెస్టు మ్యాచ్‌లలో 200 పరుగులు చేసింది. ఇందులో ఆమె అత్యధిక స్కోరు 69. బౌలింగ్‌లో 12 వికెట్లు తీసింది. వన్డేల విషయానికి వస్తే, 146 మ్యాచ్‌లలో 3943 పరుగులు సాధించింది. ఇందులో 6 సెంచరీలు, 19 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఆమె అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు 171 నాటౌట్. వన్డేల్లో 31 వికెట్లు పడగొట్టింది. ఇక టీ20 ఫార్మాట్‌లో, 181 మ్యాచ్‌లలో 3639 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీ20లలో 32 వికెట్లు కూడా తీసింది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ ఎంచుకొని 126 పరుగులు చేసింది. దీనికి బదులుగా భారత జట్టు 17 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. హర్మన్‌ప్రీత్ 26 పరుగులు చేసి భారత్ సిరీస్ గెలవడంతో సాయపడింది.



# భారత షాట్‌పుట్ క్రీడాకారిణి జాస్మిన్ కౌర్‌పై సస్పెన్షన్

భారత ప్రముఖ షాట్‌పుట్ క్రీడాకారిణి జాస్మిన్ కౌర్ డోపింగ్ పరీక్షలో విఫలం కావడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ ఆమెను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. నాడ్ విడుదల చేసిన సస్పెండ్ చేయబడిన క్రీడాకారుల జాబితాలో జాస్మిన్ కౌర్ పేరు కూడా ఉంది. 22 ఏళ్ల జాస్మిన్ కౌర్.. ఈ ఏడాది డెహ్రాడూన్‌లో జరిగిన క్రీడల్లో 15.97 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ త్రోతో బంగారు పతకం సాధించింది. పంజాబ్‌కు చెందిన ఈ క్రీడాకారిణి గత ఏడాది జరిగిన విశ్వవిద్యాలయాల మధ్య పోటీలలో 14.75 మీటర్ల త్రో చేసి రెండో స్థానంలో నిలిచింది. ఆమెకు దగ్గు మందులలో సాధారణంగా కనిపించే టెర్బుటాలినే అనే ఉత్ప్రేరకం డోపింగ్ పరీక్షలో కనుగొనబడింది. ఇదిలా ఉండగా.. 20 ఏళ్ల లోపు ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన రెజ్లర్ నితికపై 4 సంవత్సరాల నిషేధం విధించబడింది. ఈ నిషేధం గత ఏడాది మే 28 నుంచి అమల్లోకి వచ్చింది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంతో పాటు ఆసియా ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన జూనియర్ ప్రపంచ ఛాంపియన్ రెజ్లర్ రితిక హుడాకు కొన్ని రోజుల క్రితం విధించిన నిషేధాన్ని అనుసరించి, ఇప్పుడు మరో ఇద్దరికి నిషేధం విధించబడింది. రితిక హుడాకు జులై 7న తాత్కాలిక నిషేధం విధించబడింది. ఢిల్లీలో జరిగిన ఎంపిక పోటీల సందర్భంగా నాడా సేకరించిన మూత్ర నమూనాలో డోపింగ్‌కు పాల్పడినట్లు కనుగొనబడటంతో ఈ చర్య తీసుకున్నారు. ఈ వరుస సంఘటనలు భారత క్రీడా ప్రపంచంలో పెద్ద సంచలనం సృష్టించాయి. డోపింగ్ వాడకం పట్ల క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తేల్చి చెప్పారు.

# ఇంగ్లాండ్‌ను తొలి సెషన్‌లోనే దెబ్బకొట్టాడు

## లార్డ్స్ టెస్టులో టీమ్ఇండియా హవా

## ఇంగ్లాండ్ నడ్డి విరిచిన నితీశ్‌కుమార్ రెడ్డి



లార్డ్స్ టెస్టులో టీమ్ఇండియా యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి జట్టుకు తొలి సెషన్‌లోనే బ్రేక్ ఇచ్చాడు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌ను తొలి సెషన్‌లోనే దెబ్బకొట్టాడు. ఓపెనర్లు జాక్ క్రాలీ (18 పరుగులు), బెన్ డకెట్ (23 పరుగులు) ను పెవిలియన్ చేర్చి టీమ్ఇండియా డగౌట్‌లో జోష్ నింపాడు. దీంతో 50 పరుగులలోపే ఇంగ్లాండ్ రెండు వికెట్లు కోల్పోయింది. డ్రింక్స్ బ్రేక్ వరకు 14వ ఓవర్‌లలో ఇంగ్లాండ్ స్కోర్ 39-0. ఇక డ్రింక్స్ బ్రేక్ అనంతరం కెప్టెన్ గిల్, నితీశ్‌కు బంతినిచ్చాడు. అయితే రెండో బంతికే డకెట్ ఫోర్ బాదాడు. ఆ తర్వాత బంతికే డకెట్‌ను అద్భుత బంతితో నితీశ్ బోల్తా కొట్టించాడు. నితీశ్ వేసిన షార్ట్ బాల్‌ను ఆడేందుకు డకెట్ ప్రయత్నించాడు. అది బ్యాట్‌కు ఎడ్జ్ అయ్యి కీపర్ రిషబ్ పంత్ చేతిలో పడింది. దీంతో ఇంగ్లాండ్ 43 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఇలా జట్టుకు నితీశ్ తొలి బ్రేక్ ఇచ్చాడు. ఇక డకెట్ ఔట్ అవ్వడంతో ఒలీ పోప్ క్రీజులో వచ్చాడు. ఎదుర్కొన్న రెండో బంతిని సింగిల్‌గా మలిచాడు. ఆఖరి బంతికి జాక్ క్రాలీ క్రీజులో ఉన్నాడు. ఈసారి కూడా సింపుల్‌గా స్లో డెలివరీ వేశాడు నితీశ్. ఈ బంతి కూడా క్రాలీ బ్యాట్‌ను తాకి వికెట్ల వెనుక కీపర్ చేతుల్లో పడింది. అంతే క్రాలీ 43 బంతులాడిన క్రాలీ 18 పరుగుల వ్యక్తిగత స్కోర్‌తో పెవిలియన్ చేరాల్సి వచ్చింది. దీంతో ఇంగ్లాండ్ డగౌట్ నిశబ్దంగా మారిపోయింది. అలా నాలుగు బంతుల వ్యవధిలో ఇంగ్లాండ్ ఓపెనర్లు ఇద్దరినీ కోల్పోయింది. ప్రస్తుతం 22 ఓవర్లకు ఇంగ్లాండ్ 73-2 స్కోర్ తో ఉంది. క్రీజులో జో రూట్ (19), ఒలీ పోప్ (7) ఉన్నారు. కాగా నితీష్ పెర్ఫార్మెన్స్‌కు ఫిదా అయిన కెప్టెన్ గిల్ మామా అంటూ మరింత ఉత్సాహపరిచాడు. స్టంప్స్ మైక్‌లో రికార్డు అయిన ఆడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. టీమిండియా మరోసారి టాస్ గెలవడంలో విఫలమైంది, ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఇది వరుసగా మూడో టాస్ ఓటమి. లార్డ్స్‌లో జరిగిన మూడవ టెస్ట్‌లో, ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తొలి బౌలింగ్ స్పెల్‌ను జస్ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ ప్రారంభించారు. పది ఓవర్ల తర్వాత కూడా వికెట్ రాకపోవడంతో బౌలింగ్ స్పెల్ మార్చారు. నితీష్ రెడ్డిని బౌలింగ్‌కు దించాడు కెప్టెన్ గిల్. కెప్టెన్ తనపై ఉంచి నమ్మకాన్ని నితీష్ ప్రూవ్ చేసుకున్నాడు. మూడో బంతికే డకెట్‌ను అవుట్ చేశాడు. రెండో బంతికి ఫోర్ కట్టిన ఇంగ్లీష్ ఓపెనర్‌ను తర్వాత బంతికే బోల్తా కొట్టించాడు. లెగ్ సైడ్ వేసిన షార్ట్ బంతి రావడంతో దాన్ని కూడా బౌండరిగా మార్చాలని చూశాడు. కానీ అతని ఎత్తు పారలేదు. బంతి డకెట్ గ్లావ్‌కు తగిలి పంత్ చేతికి చిక్కింది. అంతే 23 పరుగులు చేసిన డకెట్ పెవిలియన్ బాటపట్టాల్సి వచ్చింది. అదే ఓవర్‌లో ఆఖరి బంతికి నితీష్ రెడ్డి మరో మ్యాజిక్ చేశాడు. ఈసారి మరో ఓపెనర్ క్రాలేని అవుట్ చేశాడు. 4 బంతుల వ్యవధిలోనే ఇద్దరు ఓపెనర్లను అవుట్ చేశాడు. బంతిని లూప్ చేయడంతో క్రాలే టెంప్ట్ అయ్యాడు. దీంతో బంతి గ్లోవ్‌ను తాకుతూ స్టంప్స్ వెనుక ఉన్న పంత్ చేతిలో పడింది. దీంతో క్రాలే 18 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. తొలి ఓవర్‌లోని వికెట్లు తీయడంతో టీమిండియా కెప్టెన్ సహా సహచర ఆటగాళ్లంతా నితీష్ రెడ్డిని మరింతగా ప్రోత్సహించారు. తెలుగులో మాట్లాడుతూ శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. ఓ అద్భుతమైన బంతిని చూసి బాగుందిరా మామా అంటూ పొగడటం స్టంప్‌మైక్‌లో రికార్డు అయింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగుందిరా మామా అనే హ్యాష్ ట్యాగ్‌తో ట్రెండ్ అవుతోంది. అంతే కాదు వాట్ రా రెడ్డి అనే మాట కూడా బాగా ట్రెండ్ అవుతుంది. సాధారణంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు ఒకే టీంలో ఉండటంతో వారి వారి భాషల్లో ఉండే ట్రెండీ వర్డ్స్ తరచూ మాట్లాడుతుంటారు క్రికెటర్లు. దీనికి తోడు ఐపీఎల్ రాక కూడా వారిని మరింత లోకలైజ్ చేసింది. ఆయా ఫ్రాంఛైజీల కోసం ప్రమోషన్స్ కూడా ఆయా భాషల్లో చేస్తున్నారు. అందుకే ఇలాంటి ట్రెండీ వర్డ్స్‌ను క్రికెటర్లు ఈ మధ్య కాలంలో తరచూ వాడుతున్నారు. ఇప్పుడు నేషనల్ టీమ్‌కు ఆడినప్పుడు కూడా సదరు ఆటగాడిని ప్రోత్సహించేందుకు వారి భాషలోనే చెబుతున్నారు. ఇక్కడ గిల్ చేసింది కూడా అదే. మొన్నటి ఐపీఎల్ వరకు దేశ విదేశ క్రికెటర్లంతా కూడా తగ్గేదేలే అన్న డైలాగ్‌ను, ఆ బాడీ లాంగ్వేజ్‌ను బాగా వాడేశారు. ఐపీఎల్‌లో భారీ స్కోర్ చేసినా మంచి వికెట్లు తీసిన ఈ సిగ్నేచర్ స్టైల్‌లో క్రికెట్ అభిమానులను ఉత్సాహపరిచేవాళ్లు. పుష్ప పాన్ ఇండియా మూవీగా విడుదలైన తర్వాతా ఈ డైలాగ్ బాగా ఫేమస్ అయిపోయింది. విదేశీ క్రికెటర్లు సైతం ఈ డైలాగ్‌తో రీల్స్ చేశారు. గ్రౌండ్‌లో కూడా తగ్గేదేలే అని గడ్డం సవరించి అభిమానుల్లో జోష్ నింపారు.

## తొలి రోజు ముగిసిన ఆట.. ఇంగ్లాండ్ 251/4

లార్డ్స్: ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న మూడో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్.. ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. జో రూట్ (99 బ్యాటింగ్ ; 191 బంతుల్లో 9 ఫోర్లు), బెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్‌బీ 102 బంతుల్లో 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. జాక్ క్రాలీ (18), బెన్ డకెట్ (23), ఓలీ పోప్ (44), హ్యారీ బ్రూక్ (11) పరుగులు చేశారు. భారత బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి 2, జస్త్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ పడగొట్టారు.




# జగన్మోహన్ రావు ఎన్నికే పెద్ద మోసం

## వెలుగులోకి సంచనల విషయాలు



ఉచిత టిక్కెట్ల కోసం ఐపీఎల్ టీం సన్ రైజర్స్ పై బెదిరింపులకు దిగిన హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును సీఐడీ అరెస్టు చేసింది. ఇప్పుడు అసలు ఆయన హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికే చెల్లదన్న ఆరోపణలు వస్తున్నాయి. హెచ్సీఏ అధ్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్రావు నకిలీ పత్రాలు సమర్పించినగా సీఐడీ అధికారులకు ఫిర్యాదు అందింది. శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించిన జగన్మోహన్రావు ఎన్నికల్లో పోటీ చేశారు. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ సి కృష్ణ యాదవ్ సంతకం ఫోర్జరీ చేశారు. కృష్ణ యాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత... ఫోర్జరీ పత్రాలను జగన్మోహన్ రావుకు అందించారు. నకిలీ పత్రాలుతోనే HCA అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్మోహన్ రావు ఎన్నికయినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే HCA నిధులు దుర్వినియోగం చేశారని జగన్ మోహన్ రావు పై అభియోగాలు ఉన్నాయి. నిధులు దుర్వినియోగంపై సిఐడి కి ఫిర్యాదు చేసిన టి సి ఏ అధ్యక్షుడు గురువారెడ్డి దర్యాప్తు చేయాలని కోరారు. ధరమ్ గురవా రెడ్డి ఫిర్యాదు ఆధారంగా, సీఐడీ 2025 జూన్ 9న భారతీయ శిక్షాస్మృతి (IPC) సెక్షన్‌లు 465 (ఫోర్జరీ), 468 (మోసం కోసం ఫోర్జరీ), 471 (నకిలీ పత్రాలను ఒరిజినల్‌గా ఉపయోగించడం), 403 (ఆస్తి దుర్వినియోగం), 409 (పబ్లిక్ సర్వెంట్ చేత నేరపూరిత విశ్వాస విచ్ఛిన్నం), 420 (మోసం), 34 (సాధారణ ఉద్దేశంతో చేసిన చర్యలు) కింద కేసు నమోదు చేసింది. జగన్మోహన్ రావు, హెచ్‌సీఏ కోశాధికారి సి.జె. శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కంటేలతో కలిసి సుమారు 2.32 కోట్ల రూపాయలను నిధులను అక్రమంగా ఉపయోగించినట్లు సీఐడీ దర్యాప్తులో తేలింది. జులై 9, 2025న జగన్మోహన్ రావు, శ్రీనివాసరావు, సునీల్ కంటే, రాజేంద్ర యాదవ్, కవితను సీఐడీ అదుపులోకి తీసుకుంది. జగన్మోహన్రావుకు కోశాధికారి శ్రీనివాసరావు సీఈవో సునీల్ సహకరించినట్లు ఆధారాలు లభించాయి. జగన్మోహన్రావు ,శ్రీనివాసరావు, సునీత్, రాజేంద్ర యాదవ్, కవిత అరెస్ట్ చేశారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో, సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ఫ్రాంఛైజీ హెచ్‌సీఏ అధికారులపై బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్, అదనపు ఉచిత టికెట్ల డిమాండ్ ఆరోపణలు చేసింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మార్చి 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందు, జగన్మోహన్ రావు కార్పొరేట్ బాక్స్ (F3) ను తాళం వేసి, 20 అదనపు ఉచిత టికెట్లను డిమాండ్ చేసినట్లు SRH ఆరోపించింది. SRH ఈ బెదిరింపులపై బీసీసీఐ , ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసింది, హెచ్‌సీఏ బ్లాక్‌మెయిలింగ్ విధానాలను అరికట్టాలని కోరింది. తెలంగాణ విజిలెన్స్ కమిషన్ నివేదిక కూడా SRH ఆరోపణలను ధృవీకరించింది, దీని ఆధారంగా సీఐడీ చర్యలు తీసుకుంది. రావు బీఆర్‌ఎస్ పెద్దలకు అత్యంత సన్నిహితులు. 2010లో అక్షర ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించాడు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో అధ్యక్షుడిగా, జనరల్ సెక్రటరీగా, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. హెచ్‌సీఏ చాలా కాలంగా వివాదాల్లో మునిగి తేలుతోంది. అజహరుద్దీన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా నిధుల దుర్వినియోగం ఆరోపణలు వచ్చాయి.

# సందడి చేసిన శుభమన్

భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన యువీక్యాన్ ఫౌండేషన్ కోసం జులై 8, 2025న లండన్‌లో ఒక ఛారిటీ డిన్నర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ విందులో క్రికెట్ ప్రపంచంలోని అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడానికి, చికిత్స కోసం నిధులు సేకరించడానికి ఈ డిన్నర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విందుకు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన టీమ్ మొత్తంతో కలిసి వచ్చాడు. ఈ నేపథ్యంలో శుభమన్ గిల్ ఒక ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ గిల్‌తో కలిసి కనిపించడం మళ్ళీ చర్చకు దారితీసింది. క్యాన్సర్ మహమ్మారిని జయించిన తర్వాత యువరాజ్ సింగ్ 2011లో యువీక్యాన్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. ఈ ఫౌండేషన్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడానికి, ముందుగానే గుర్తించడాన్ని ప్రోత్సహించడానికి, రోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు పనిచేస్తుంది. దానిలో భాగంగానే లండన్‌లో జరిగిన ఈ ఛారిటీ డిన్నర్ లక్ష్యం ఫౌండేషన్ కోసం నిధులను సేకరించడం. ఇప్పుడు ఈ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్, సారా టెండూల్కర్ కనిపించిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైరల్ అవుతున్న ఫోటోలో శుభ్‌మన్ నవ్వుతూ కనిపించాడు. సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ అతని ముందు కూర్చుని ఉంది. అయితే, ఈ ఫోటో గిల్ తన జట్టుతో విందుకు వచ్చినప్పుడు, సారా అప్పటికే అక్కడ ఉన్నప్పుడు తీసినది అని చెబుతున్నారు. సారా టెండూల్కర్ ఈ ప్రోగ్రాం ఫోటోను తన సోషల్ మీడియా అకౌంట్లో షేర్ చేసింది. అందులో ఆమె తన ఫ్రెండ్స్?తో కనిపించింది. శుభ్‌మన్ గిల్ పేరు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌తో చాలాసార్లు వినిపించింది. ఒకానొక సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ సంబంధం ఉన్నట్లు వదంతులు ప్రచారంలోకి వచ్చాయి. దీనికి బలం చేకూర్చేలా ఇద్దరూ గతంలో సోషల్ మీడియాలో ఒకరినొకరు ఫాలో అయ్యేవారు. అలాగే, పరస్పరం పోస్ట్‌లకు లైక్ చేయడం, కామెంట్ చేయడం కూడా జరిగేది. కానీ ఆ తర్వాత ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం ద్వారా వదంతులకు తెర దించారు. అయితే, శుభ్‌మన్, సారా ఈ వదంతుల గురించి ఇప్పటివరకు బహిరంగంగా నోరు విప్పలేదు.



# బాహుబలి విడుదలై పదేళ్లు పూర్తి

## రాజాసాబ్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ మూవీ 'బాహుబలి' మొదటి భాగం విడుదలై పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా అభిమానులే కాకుండా, చిత్ర బృందమంతా పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అదే సమయంలో ప్రభాస్ మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అది కూడా ఈసారి తన స్టైలిష్ లుక్ తో. ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో మొదటి నుంచి సంబంధం ఉన్న మాస్ ప్రొడ్యూసర్ ఎస్.కె.ఎన్ తాజాగా సెట్స్ నుంచి ఓ ఫోటోను షేర్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ కనిపించిన విధానం అభిమానుల మన్ననలు పొందుతోంది. స్టైలిష్ గా ఓ వింటేజ్ లుక్‌లో - ఓపెన్ షర్ట్, కూల్ గ్లాసెస్, లైట్ బీట్ క్రాఫ్ట్ లుక్ లో కనిపించిన ప్రభాస్ యూత్‌ఫుల్ ఎనర్జీకి ప్రతీకగా నిలిచాడు. చాలాకాలం తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి మాస్ క్లాస్ లుక్‌లో చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇదే సందర్భంగా ఎస్‌కెఎన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. 'ఇది కేవలం ఓ బర్త్‌డే మూమెంట్ మాత్రమే కాదు, రాబోయే విజయం కోసం మొదటి సూచన కూడా..! ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్ సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయనడం గ్యారంటీ-' అంటూ తెలిపాడు. బాహుబలి పదేళ్లు పూర్తి చేసుకున్న స్పెషల్ రోజున ఇలా ప్రభాస్ నుంచి వచ్చిన తాజా లుక్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు.

# రామయణంలో బిగ్‌బి అమితాబ్ వాయిస్ ?

ప్రతిష్ఠాత్మకంగా రానున్న 'రామాయణ' సినిమాకు సంబంధించిన వీడియో ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఇందులో నటీనటుల వివరాలు ప్రకటించిన దగ్గరనుంచి సినీ ప్రముఖులు వారి అభిప్రాయాలను తెలుపుతున్నారు. మరోవైపు, ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ కూడా భాగమైనట్లు- తెలుస్తోంది. దీనిపై కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవల రూపొందిన 'కల్కి 2998 ఏడీ'లో అశ్వత్థామ పాత్రలో అద్భుతమైన నటనతో ఆశ్చర్యపరిచారు బిగ్ బీ. ఇప్పుడాయన 'రామాయణ'లోనూ భాగం కానున్నట్లు- సమాచారం. ఇందులో జటాయువు పాత్రకు అమితాబ్ వాయిస్‌ఓవర్ ఇవ్వనున్నట్లు- టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇందులో రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. దీనిపై బాలీవుడ్ నటు-డు, చిత్ర నిర్మాత రాజ్ బి శెట్టి తన అభిప్రాయాన్ని తెలిపారు. యశ్ ఎంపికపై రాజ్ తన ఇన్‌స్టాలో స్పందించారు. మొదటిసారి ఒక విలన్‌ను కూడా అందరూ మెచ్చుకుంటున్నారని అన్నారు. యశ్ ఆ పాత్రలో వందశాతం న్యాయం చేస్తారని తెలిపారు. మనమంతా అతడి కోసం ఎదురుచూడాలని పోస్ట్ పెట్టారు. దీనిపై యశ్ స్పందించారు. 'ధన్యవాదాలు సర్. రామాయణం.. అన్ని భావాలకు అతీతమైన కావ్యం' అని రిప్లై పెట్టారు. ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా దీని గ్లింప్స్ విడుదలైన నేపథ్యంలో రణ్‌బీర్ ఎంపికపై గతంలో ఈ సినిమా క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. 'రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నటనలో ఆయనతో ఎవరూ పోటీ- పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. రావణుడి సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించే అవకాశం ఉందని సమాచారం. రెండు భాగాలుగా ఇది రానుంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానుంది. సుమారు రూ.1600 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.




# పూజను వెన్నాడుతున్న డిజాస్టర్స్



## ధనుష్ మూవీలో హీరోయిన్ ఛాన్స్ మిస్

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ-వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టు-కుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు- తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ- మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ విడుదల

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' బాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన నిర్మాత ప్రవీణ పరుచూరి.. ఇప్పుడు 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే సినిమాతో, దర్శకురాలిగా, పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రానా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జులై 18న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం - ట్రైలర్ విడుదల చేసింది. ఇది ఊహించని ట్విస్ట్ లతో.. నాన్ స్టాప్ కామెడితో ఆకట్టుకుంది. ఇందులో రామకృష్ణ అనే యువకుడు ఒక చిన్న పట్టణంలో డ్యాన్స్ స్టూడియో నడుపుతుంటాడు. అతను సావిత్రిని ప్రేమిస్తుంటాడు, ఆమె కూడా అతని భావాలకు స్పందిస్తున్నట్లు- కనిపిస్తుంది. ఓ రోజు సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. ఆనందంగా వెళ్లిన రామకృష్ణ జీవితంలో అప్పటి నుంచి భారీ మలుపు తిరుగుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, ఒక అనూహ్యమైన మిస్టరీ, దైవిక సంబంధాల నడుమ నడిచే కథ గా మారుతుంది. ఇక మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో నటిస్తూ తమ పాత్రలకు స్వచ్ఛమైన అమాయకత్వాన్ని తీసుకొచ్చారు. రవీంద్ర విజయ్ కూడా తన పాత్ర ద్వారా బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నారు. మొత్తానికి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించడంలో సఫలమైంది. ఈ సినిమా జులై 18 న విడుదలకు సిద్ధమవుతుంది. రొటీన్ ప్రేమ కథలకు భిన్నంగా మలచిన ఈ గ్రామీణ డ్రామా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇచ్చే అవకాశం ఉంది.

# విజయ్ సేతుపతి..మూవీ తెలుగులో సార్ మేడమ్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్‌మేడమ్ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఫుడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు- తెలుస్తుంది. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463